ధర్మం కోసం పోరాడటమే మొహర్రం


కొప్పరపాడులో పీర్ల గ్రామోత్సవంలో సందడి చేస్తున్న గ్రామస్తులు


మార్టూరులో పీర్లు ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు


చీరాల: అగ్నిగుండంలో నిప్పలు తొక్కుకుంటు వెళ్తున్న భక్తులు

- వాడవాడలా మొహర్రం వేడుకలు
- నిప్పుల గుండాల్లో తొక్కిన భక్తులు
- ఊరేగిన పీర్లు.. సందడి చేసిన యువత

బల్లికురవ/జే.పంగులూరు: శతాబ్దాల క్రితమే ప్రజాస్వామ్యం కోసం, మానవ హక్కుల కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటం మొహర్రం. ఈ పేరు వినగానే పీర్లు, నిప్పుల గుండాలు, గుండెలు బాదుకుంటూ మాతం చదవడాలు గుర్తుకొస్తాయి. మహ్మద్ ప్రవక్త అధర్మాన్ని, అన్యాయాన్ని వ్యతిరేకించి ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ప్రశాంతంగా జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. హజరత్ ఇమాం హుసేన్‌ను గుర్తుచేసుకుంటూ పీర్ల దేవుళ్ల ప్రతిమలను ఊరేగించి భక్తులు సంతాపం ప్రకటిస్తారు. బల్లికురవ మండలంలో మొహర్రం వేడుకలు శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వరకు ఘనంగా నిర్వహించారు. ముజావర్ల ఆధ్వర్యంలో కొప్పరపాడు, వైదన, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, కొణిదెన, వల్లాపల్లి గ్రామాల్లో చావిడిలో ఉన్న పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ముజావర్లు షేక్ సుభాని, మీరా వలి, అబ్దుల్లా, ఆదాం సాహెబ్ ప్రత్యేక పూజల తదుపరి మేళతాళాలు డప్పువాయిద్యాలతో ఆయా గ్రామాల్లో గ్రామోత్సవంతో పీర్లనను గుండానికి చేర్చారు. శనివారం గుండంలో ఉన్న పీర్లను తిరిగి మేళతాళాలతో చావిడిలోకి చేర్చి భద్రపరిచారు. మొహర్రం సందర్భంగా బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

అలంకరణలో పీర్ల చావిడులు..

చీరాల అర్బన్/వేటపాలెం: మొహర్రం వేడుకలను శుక్రవారం అర్ధరాత్రి నుంచి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పేరాలలోని పీర్ల చావడి, ఎల్‌బీఎస్ నగర్, చీరాలలోని నవాబుపేట, గంజిపాలెం తదితర ప్రాంతాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేరాలలోని పీర్ల చావడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు పీర్లను పట్టుకొని అగ్నిగుండంలో నిప్పులపై తొక్కుకుంటూ వెళ్లి తమ మొక్కులను చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వేటపాలెం మండల పరిధిలోని వివిధ మసీదుల్లో ముస్లింలు బక్రీద్ పండుగను పురస్కరించుకొని శనివారం నమాజ్‌లు చేశారు. మర్కస్ అక్సా మసీద్‌లో బక్రీద్ పండుగ నవాజ్‌లు నిర్వహించారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో హజ్ తీర్థయాత్ర ఈ మాసంలోనే జరుగుతుందన్నారు. అల్లా ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక కుమారుడిని ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమౌతాడు. ఈ సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం..

కారంచేడు/మార్టూరు/యద్దనపూడి/చినగంజాం: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు మొహర్రం పండుగను జరుపుకుంటారు. ఈ క్రమంలో శనివారం మండలంలోని ఆదిపూడి, కారంచేడు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, కుంకలమర్రు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఒకరికొకరు మొహర్రం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


గన్నవరం రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్


వేటపాలెం: పీర్ల చావిడిలో అలంకరించిన పీర్లు

చినగంజాం, పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు మండలాల్లో ముస్లింలు మొహర్రం పండుగను వేడుకగా జరుపుకున్నారు. మండల కేంద్రం మార్టూరులో, గన్నవరం రోడ్డులోని పీర్ల చావిడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను ముస్లింలు గ్రామంలోని వీధుల వెంట ఊరేగింపు నిర్వహించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు మొహర్రం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


దగ్గుబాడులో పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు


జే పంగులూరు: పీర్ల ఊరేగింపులో యువత


పంగులూరులో ఏర్పాటు చేసిన నిప్పుల గుండం

క్లుప్తంగా

ఎంపీని కలిసిన మాజీ జెడ్పీటీసీ


ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిని ఇంకొల్లు మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి శనివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానికంగా పలు సమస్యలు గురించి రాజకీయ పరిణామాలపై ఆయన మాట్లాడారు.

వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ


వృద్ధులకు చేతికర్రలు, పండ్లు అందజేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో నేతాజీ వృద్ధాశ్రమంలోనాగబైరు రామతులసమ్మ రెండో వర్ధంతి సందర్భంగా కుమారుడు క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు వృద్ధులకు 30 మందికి శనివారం చేతికర్రలు, పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ వృద్ధులు అందరూ ఆశ్రమ నిర్వాహకులకు సహకరిస్తూ వివాదాలు లేకుండా ప్రశాంత జీవనం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎంబీ సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే ఆనందం


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని, సేవా గుణం మంచి లక్షణమని చీరాల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఆదెళ్ల కృష్ణ, రమ్య, రచిత్ చైత్రల సహకారంతో హాస్పిటల్‌లోని రోగులకు రొట్టెలు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. హాస్పిటల్ అభివృద్ధికి క్లబ్‌ల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తోడ్పాటునందించాలన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నన్నపనేని రామకృష్ణ, బాచిన నాగమల్లేశ్వరరావు, బీ హేమంత్‌కుమార్, ఏ మల్లికార్జునరావు, పీ సుబ్రహ్మణ్యేశ్వరరావులు, వంశీకృష్ణ, తాడివలస దేవరాజు, రావి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిరసన


నిరసన తెలుపుతున్న ఎస్టీలు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ వివేకానంద కాలనీలో దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లో తమకు నివేశన స్థలాలు కేటాయించాలని కోరుతూ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి బ్రమ్మయ్య ఆధ్వర్యంలో ఎస్టీ కుటుంబాలు శనివారం నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న సర్వేయర్ సాయి, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జీ సురేష్ ఘటనా స్థలానికి వెళ్లారు. నిరసన చేస్తున్న ఎస్టీతో అధికారులు మాట్లాడారు. ఇళ్లులేని వారిని గుర్తించి అర్హులైన వారుంటే వారికి ఇదే లే అవుట్‌లో నివేశన స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

ఉద్యోగ విరమణ కాలం పెంపుపై హర్షం

ఒంగోలు: యూనివర్శిటీల పరిధిలో పర్మినెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సోమశేఖర, డాక్టర్ జ్ఞానేశ్వర రెడ్డి, డాక్టర్ నిర్మలమణి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల యూనివర్శిటీ పరిధిలో అధ్యాపకుల కొరత తీరుతుందని, అదే విధంగా సీనియర్ ప్రొఫెసర్ల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

పరుగులు పెడుతున్న అభివృద్ధి


సమాధుల వద్ద మెరక తోలేందుకు పోసిన ఇసుక కుప్పలు


చదును చేస్తున్న జేసీబీ

- అభివృద్ధిబాటలో జయంతిపేట శ్మశానవాటిక
- శ్మశానవాటిక ప్రాంతంలో పార్కు, పచ్చదనం
- రూ. 20 లక్షల నిధులతో శరవేగంగా పనులు చేయిస్తున్న ఎమ్మెల్యే కరణం


మున్సిపల్ అధికారులతో కలసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం (ఫైల్)

చీరాల రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అటు సంక్షేమ పథకాలతో పాటు ఇటు అభివృద్ధి పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి. చీరాల పట్టణంలోని జయంతిపేట శ్మశానవాటిక అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి నడుం బిగించారు. గతం నుంచి ఇప్పటివరకు శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంతో నిత్యం మురుగు నీటితో నిండి దోమలకు, పందులకు ఆవాసాలుగా మారిపోయింది. వాటిక ముందువైపు స్థలం ఉన్నప్పటికీ మృతదేహాలను పూడ్చివేసేందుకు పల్లంగా ఉండడంతో ఆ స్థలం నిరుపయోగంగా ఉండేది. మురుగు నీరు నిలవుండడంతో కొన్ని సమాధులు కూడా శిథిలావస్థలకు చేరాయి. ఈ క్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ సల్లూరి అనిల్ చొరవతో స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులతో కలసి శ్మశానవాటికను పరిశీలించారు. దీనావస్థలో ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని తలంచి తక్షణమే మున్సిపల్ నిధులు రూ. 20 లక్షలకు పైగా కేటాయించారు. వాటిలో రూ. 10 లక్షలకుపైగా శ్మశానవాటికలో ఇసుకతో మెరుక తోలిస్తున్నారు. మరో రూ.10 లక్షలు శ్మశానవాటిక సమీపంలో పార్కు ఏర్పాటు చేస్తున్నారు. పదిరోజుల నుంచి నిరంతరాయంగా దగ్గరుండి పనులను చేయిస్తున్నారు.

రూ. 20 లక్షలు మున్సిపల్ నిధులకేటాయింపు..

ఎంతో దీనావస్థలో ఉన్న శ్మశానం అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే చొరవ చూపారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి మున్సిపల్ నిధులు రూ. 20 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో పల్లంగా ఉన్న శ్మశానవాటికలో ఇసుకతో మెరక తోలిస్తున్నారు. శ్మశానవాటిక సమీపంలో పార్కు నిర్మాణం చేపట్టారు. పార్కులో పచ్చదనంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. శ్మశానవాటికలో మృత దేహాలను పూడ్చేందుకు వచ్చినవారు కాసేపు సేదతీరేందుకు కూడా ఈపార్కు చక్కగా ఉపయోగపడుతుంది.

ఎమ్మెల్యే సహకారం మరువలేనిది..

జయంతిపేట శ్మశానవాటికలో స్థలంలేక మృతదేహాలను పూడ్చేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఆయన మున్సిపల్ నిధులు రూ. 20 లక్షలు కేటాయించారు. పనులు కూడా తక్షణమే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. దళితులు, దళిత క్రిస్టియన్లంటే ఎమ్మెల్యేకు అమితమైన ప్రేమ. అడిగిన వెంటనే నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నారు. ఆయన సహకారం మరువలేనిది.

– సల్లూరి అనిల్, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్

వేగంగా పనులు చేయిస్తున్నాం..

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నాం. పల్లంగా ఉన్న ప్రాంతంలో ఇసుకతో మెరక తోలిస్తున్నాం. పార్కు నిర్మాణం చేపట్టాం. ఈ పనులు పూర్తయితే శ్మశానవాటిక చుట్టూ గోడ నిర్మిస్తాం. దీని నిర్మాణానికి కూడా నిధులు ఉన్నాయి, టెండర్లు కూడా పిలిచాం. గోడ పనులు కూడా త్వరలో ప్రారంభించి శ్మశానవాటికకు రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేస్తాం.

– ఏసయ్య, మున్సిపల్ డీఈ

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


బుక్‌లెట్ అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి): అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ మోహన్‌రెడ్డి రెండు కళ్లని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి లబ్ధిదారులను పలకరించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారుల నుంచి ప్రభుత్వ కార్యక్రమాలు ఎలా ఉన్నాయి... ప్రభుత్వం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వచ్చిన సమాధానంతో సంతృప్తి చెందారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిని చూపే బుక్‌లెట్‌ను వారికి అందించి ముందుకు సాగారు. చైతన్య మాట్లాడుతూ టీడీపీ అబద్దాల వైఖరితో ముందుకు సాగుతోందన్నారు. దౌర్జన్యకాండతో ఓట్లు సంపాదించాలంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని విమర్శించారు. ప్రజలు మెచ్చిన పాలన అందించే నాయకులను మాత్రమే వారు తమ గుండెల్లో నిలుపుకుంటారని గుర్తు చేశారు. మోసపూరిత మాటలు చెప్పే నాయకులకు కాలం చెల్లిందని ఎద్దేవా చేశారు. వారికి రేపు ఓట్లు రాలే అవకాశం లేదన్నారు. ఏ యాత్రలు చేసిన ఒరిగేదేమి లేదన్నారు. ప్రజలతో మమేకమైన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి సాటిగా నిలిచేవారు లేరన్నారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాలో ఉన్న నాయకులు, వలంటీర్లు, అధికారులు, పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం


తగలబడతున్న వరిగడ్డి వామి

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామంలో శనివారం రాత్రి వరిగడ్డి వామి దగ్ధం అయ్యింది. గ్రామానికి చెందిన చిలుకూరి సాంబశివకు చెందిన వరి గడ్డి వామి, దీని విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని తెలిపారు. ఈ మధ్య కాలంలో పంగులూరు గ్రామంలో వరిగడ్డి వాములు తగలబడటం ఎక్కువ అయ్యిందని, ప్రమాదానికి గల కారణాలు తెలియడం లేదని గ్రామస్తులు చెప్తున్నారు. ఈఘటనపై బాధిత రైతు సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దగ్గరలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి

- మాజీ మంత్రి లక్ష్మి పద్మావతి



పౌష్టికాహారం అందజేస్తున్న మాజీ మంత్రి లక్ష్మీ పద్మావతి

చీరాల రూరల్: హెచ్ఐవీ బాధితులు క్రమంతప్పకుండా మందులు వాడుతూ బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకుంటూ మనోధైర్యంతో ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఆశారేఖా మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో హెచ్ఐవీ బాధితులకు నెలవారి అందించే పౌష్టికాహార సరుకులను ఆమె చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనారోగ్యం బారినపడిన వారికి మందులు కొంతమేరకు పనిచేస్తాయని, కానీ ఆత్మస్థైర్యంతో మరింత బలాన్ని పెంపొందించుకోవచ్చునని సూచించారు. విశ్రాంత ఉద్యోగి రెడ్డి నాగభూషణం, ఆర్థిక సహకారంతో బాధితులకు సరుకులు అందించినట్లు సీబీవో అధ్యక్షురాలు నాగేంద్రమ్మ తెలిపారు. కార్యక్రమంలో సంఘ పీఎం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటనలో బాధితులకు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో విద్యుదాఘతంతో సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య శనివారం సాయం అందజేశారు. కుటుంబ సభ్యులు పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం అందించే విధంగా చూస్తాని చెప్పారు. పరామర్శలో మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, సర్పంచ్ నగేశ్, శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.